RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 243 | పేజీలు : 08 | శనివారం | 12-09-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

## అసెంబ్లీలో న్యాయం జరగట్లేదు..

### అందుకే ఢిల్లీలో ఫిర్యాదు చేశాం: ఎమ్మెల్యే సబిత



హైదరాబాద్ పల్స్,డెస్క్

అసెంబ్లీ ముందు బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేపై దాడి జరిగిందని ఆరోపిస్తూ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి జాతీయ మహిళా కమిషన్ ఛైర్పర్సన్, జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో అసెంబ్లీ గేటు వద్ద రసాభాస జరిగింది. ఈ సంఘటన కౌరవసభను తలపిస్తోంది. మహిళా ఎమ్మెల్యేల జుట్టుపట్టుకుని లాగారు. పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారు. పోలీసుల గొడవల్లో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కింద పడిపోయారు. 30ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న మమ్మల్ని అసెంబ్లీ లోపలికి ఎందుకు అనుమతించలేదు. కనీసం మహిళా ఎమ్మెల్యేలనైనా అనుమతించమని అడిగితే పోలీసులు వినిపించుకోలేదు. ముఖ్యమంత్రే మాపై దాడికి ఆదేశాలు జారీచేశారని నేను నమ్ముతున్నానను' అని సబిత పేథ?్కన్నారు.'అసెంబ్లీ సమావేశంలో అయినా మాపై జరిగిన దాడి గురించి చర్చ జరుపుతారనుకున్నాం. సీఎం రేవంత్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల మంత్రి, డీజీపీ ఈ సంఘటన గురించి మాట్లాడుతారని అనుకున్నాం. కానీ ఎవరూ నోరు మెదపలేదు. మాపై



# ఫామ్‌హౌజ్ లో కేసీఆర్ కుట్ర

- శాసనసభ సజావుగా జరగకుండా కేసీఆర్ ఫాంహౌస్‌లోనే కుట్రలు జరిగాయన్న రేవంత్ రెడ్డి
- ప్రజాప్రతినిధులను, పోలీసులను దూషిస్తూ మూడు రోజులు సభను అడ్డుకున్నారని మండిపాటు
- బీఆర్ఎస్ కుట్రలను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమర్థవంతంగా తిప్పికొట్టారని ప్రశంస

### మహిళా అధికారుల ముందు అభ్యంతరకరంగా వ్యవహరించారు: రేవంత్ రెడ్డి

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

శాసనసభను సజావుగా సాగనివ్వకుండా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఆయన ఫాంహౌస్‌లోనే కుట్రలు పన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అధికారం పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నాయకులు పోలీసు అధికారులను, ప్రజాప్రతినిధులను దూషిస్తూ మూడు రోజుల పాటు సభాకార్యక్రమాలను అడ్డుకున్నారని మండిపడ్డారు.నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశంలో ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘ ప్రసంగం చేశారు.సభలో అధికారులపై అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, సభాపతిని అత్యంత తీవ్ర పదజాలంతో దూషించారని, మహిళా అధికారుల ముందే టీషర్టులు విప్పి అభ్యంతరకరంగా నిరసన తెలపడం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల దిగజారుడుతనానికి నిదర్శనమని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన దళితులు నడిచిన నేలను బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేసి దళితులను ఘోరంగా అవమానించారని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుండి జరిగిన ఈ అవాంఛనీయ ఘటనలన్నింటిపై ప్రభుత్వం తరఫున సమగ్ర విచారణకు ఆదేశించామని వెల్లడించారు. బీఆర్ఎస్ కుట్రలను సమర్థవంతంగా

## ఏఐతో ఉగ్ర ప్రచారం..

### భారత్‌లో యువతకు గాలం వేస్తున్న ఐసిస్



- దాడుల నుంచి ప్రచారానికి మళ్లిన ఉగ్రవాద సంస్థలు
- ప్రచారం కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విస్తృత వినియోగం
- భారత్‌లో మహిళలు, చిన్నారులే లక్ష్యంగా ఐసిస్, అల్-ఖైదా కార్యకలాపాలు
- లింగ భేదం, వయసు ఆధారంగా ప్రత్యేక కంటెంట్ రూపకల్పన
- దక్షిణ భారతదేశంలో ఈ తరహా కార్యకలాపాలు అధికంగా ఉన్నాయని నిఘా వర్గాల వెల్లడి

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

ఐసిస్, అల్-ఖైదా వంటి భయానక ఉగ్రవాద సంస్థలు తమ పంథాను పూర్తిగా మార్చుకున్నాయి. భౌతిక దాడుల స్థానంలో భావజాల వ్యాప్తి, రాడికలైజేషన్‌ను ప్రధాన అస్త్రంగా ఎంచుకున్నాయి. ఈ ప్రమాదకర వ్యూహాన్ని అమలు చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను విస్తృతంగా ఉపయోగించుకుంటున్నాయని ఐక్యరాజ్యసమితి (ఐరాస) నివేదిక హెచ్చరించింది. ముఖ్యంగా భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా మహిళలు,

## రేవంత్ సీఎం అవడం..

# వీరప్పన్ మంత్రి అయినట్లే

- వీరప్పన్ మంత్రి అయితే ఎలా ఉంటుందో, రేవంత్ సీఎం కావడం అలాగే ఉందన్న కేటీఆర్
- సీఎం కాకముందు ఆర్టీఐతో బ్లాక్‌మెయిల్ చేసి బతికారని ఆరోపణ
- హైదరాబాద్ చుట్టూ వేల ఎకరాల భూములపై సీఎం కన్ను పడిందన్న మాజీ మంత్రి
- భూదందాల వల్లే రేవంత్ రాజీనామా చేయాల్సి వస్తుందని జోస్యం
- రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్న కేటీఆర్

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ అటవీ శాఖ మంత్రి అయితే ఎలా ఉంటుందో, భూ దందాలు చేసే

## పుతిన్‌కు ప్రధాని మోదీ

# ప్రత్యేక కానుక..

- ఏమిటీ 'తిరుక్కురళ్' ప్రాధాన్యత?
- బ్రిక్స్ సదస్సు సందర్భంగా పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ
- రష్యా అధ్యక్షుడికి 'తిరుక్కురళ్' రష్యన్ అనువాదం బహూకరణ
- తమిళ ప్రాచీన సాహిత్య గ్రంథం తిరుక్కురళ్
- మానవతా విలువలు, నైతికతపై తిరువళ్లువర్ చేసిన రచన

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

బ్రిక్స్ సదస్సు-2026 నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య కీలక ద్వైపాక్షిక చర్చలు

### కొండా సురేఖ మాజీ ఓఎస్డీ తండ్రి

# ఆత్మహత్యాయత్నం

### పరిస్థితి విషమం!

**మాజీ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ తండ్రి సుబ్రహ్మణ్యం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే వరంగల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.**

హైదరాబాద్ పల్స్,డెస్క్

కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ తండ్రి సుబ్రహ్మణ్యం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన వరంగల్‌లో కలకలం రేపింది. సుమారు 40 నిద్రమాత్రలు మింగినట్లు సమాచారం. ఉదయం ఎంతసేపటికీ

2



## సెప్టెంబర్ 17 నుంచి సేవా సంకల్ప్ అభియాన్ ప్రారంభం

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే

# పాలనలో స్పీడ్ పెరగాల్సిందే..

### ఫైళ్ల జాప్యంపై సీఎం చంద్రబాబు సీరియస్

- దస్త్రాల పరిష్కారంలో జాప్యంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం
- నెలరోజుల్లో ప్రభుత్వ ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని ఆదేశం
- సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు సూచన
- క్షేత్రస్థాయి పర్యటనలతో ప్రజా సమస్యలు తెలుసుకోవాలని దిశానిర్దేశం

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

ప్రభుత్వ దస్త్రాల పరిష్కారంలో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, పాలనలో వేగం పెంచాలని సీఎం చంద్రబాబు అధికారులను గట్టిగా హెచ్చరించారు. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు ఫైళ్లను వీలైనంత వేగంగా క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన పరిపాలనపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.సకాలంలో దస్త్రాలను పరిష్కరించకుండా జాప్యం చేస్తున్న కొందరు అధికారుల తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోపు ఫైళ్లు క్లియర్ చేసిన వారిని అభినందిస్తూనే, గంటల వ్యవధిలోనే పూర్తి చేసిన వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సమావేశానికి కొందరు ఉన్నతాధికారులు

## మానిటరింగ్ కమిటీ ఏర్పాటు



- స్థానిక సంస్థల ఎన్నికలపై షర్మిల కీలక నిర్ణయం..
- రఘువీరారెడ్డి చైర్మన్‌గా రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు
- స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించిన షర్మిల
- కమిటీలో రుద్రరాజు, పల్లంరాజు, కృపారాణి, తులసిరెడ్డి తదితర నేతలు
- గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రచించాలని దిశానిర్దేశం

2

# రేవంత్ సీఎం అవడం.. వీరప్పన్ మంత్రి అయినట్లే

మొదటి పేజీ రువాయి

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం కూడా అలాగే ఉందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ సర్కార్ తీరుపై తీవ్ర ఆరోపణలు చేశారు.సీఎం కాకముందు రేవంత్ రెడ్డి ఆర్టీఐని అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేసి బతికేవారని, అలాంటి వ్యక్తి ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఒక ముఠాను ఏర్పాటు చేసి, వారి కనుసన్నల్లో 22ఏ భూ దందా నడిపిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తెచ్చే ప్రతి స్కీం వెనుక ఒక స్కాం ఉందని, హిల్ట్ పాలసీ, మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ పేర్లతో వేల ఎకరాల భూములను కాజేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేసి భూదందాలకు తెరలేపారని దుయ్యబట్టారు.

కేసీఆర్ హయాంలో ఫాక్స్‌కాన్ వచ్చిన కొంగరకలాన్ భూములపై రేవంత్ కన్ను పడిందని, అక్కడ రూ.వెయ్యి కోట్ల కుంభకోణానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌లో వేలిముద్ర లేకుండా ఇంచు భూమి కూడా మార్చలేరని, కానీ ఇప్పుడు భూభారతితో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతోందని విమర్శించారు. భూములను కాపాడాల్సిన కాపలాదారులే కబ్జాదారులుగా మారారని అన్నారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భూదోపిడీ జరుగుతోందని, ఈ వ్యవహారాలతో రేవంత్ రెడ్డి త్వరలోనే రాజీనామా చేయాల్సి వస్తుందని కేటీఆర్ జోస్యం చెప్పారు. మరో రెండేళ్లలో కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# పాలనలో స్పీడ్ పెరగాల్సిందే..

మొదటి పేజీ రువాయి

గైర్హాజరు కావడంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి నుంచి వివరణ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ఆదేశించారు. పరిపాలనలో జవాబుదారీతనం ముఖ్యమని, ఐఏఎస్ అధికారుల పనితీరుపై 360 డిగ్రీల నివేదికను అందరి అభిప్రాయాలతో రూపొందిస్తామని తెలిపారు. కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించాలని, అప్పుడే పనితీరును మెరుగుపరుచుకోగలమని సూచించారు.

**నెల రోజుల్లో ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే..**

ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, వేగం కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు. నెల రోజుల్లో అన్ని శాఖల దస్త్రాలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్చాలని స్పష్టం చేశారు. ఈ గడువు తర్వాత భౌతిక (మాన్యువల్) ఫైళ్ల నిర్వహణను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఈ అంశంపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ, మంత్రులు కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు.

**క్షేత్రస్థాయి పర్యటనలతో సమస్యల పరిష్కారం**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే దరఖాస్తులను ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. "జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు తరచుగా గ్రామాలకు వెళ్తే చాలా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయి. ఇకపై ఈ పర్యటనల వివరాలను కూడా సమర్పించాలి" అని అన్నారు.సమస్యలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూల దృక్పథం ఏర్పడాలని ఆకాంక్షించారు. పనితీరు సరిగా లేని వారిని పక్కనపెట్టి, సమర్థంగా పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించాలని స్పష్టం చేశారు.

**గ్రామ, వార్డు సిబ్బందికి జాబ్ ఛార్ట్**

స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో సిబ్బందిపై పనిభారాన్ని హేతుబద్ధీకరించాలని (రేషనలైజ్ చేయాలని) అధికారులను ఆదేశించారు. ఒకే ఉద్యోగిపై ఎక్కువ భారం మోపకుండా, అందరికీ సమంగా బాధ్యతలు అప్పగించేలా చూడాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలోని స్వర్ణ గ్రామ సిబ్బందికి విధులను స్పష్టం చేస్తూ ఒక జాబ్ ఛార్ట్ సిద్ధం చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి స్వర్ణవార్డు, గ్రామ కార్యాలయానికి ఒక ఎలక్ట్రిక్ సైకిల్ అందించాలని కూడా సూచించారు.




# పుతిన్‌కు ప్రధాని మోదీ ప్రత్యేక కానుక..

మొదటి పేజీ రువాయి

జరిగాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, పుతిన్‌కు ఒక విశిష్టమైన సాంస్కృతిక కానుకను అందజేశారు. ప్రాచీన తమిళ సాహిత్య గ్రంథమైన 'తిరుక్కురళ్' రష్యన్ అనువాద ప్రతిని ఆయనకు బహూకరించారు.సమావేశం సందర్భంగా ఇరువురు నేతలు ఎంతో ఆత్మీయంగా పలకరించుకున్నారు. పరస్పరం కరచాలనం చేసుకుని, ఆలింగనం చేసుకున్నారు. ఈ భేటీలో పలు అంతర్జాతీయ, ద్వైపాక్షిక అంశాలపై వారు కూలంకషంగా చర్చించినట్లు సమాచారం.

**ఏమిటీ తిరుక్కురళ్?**

ప్రధాని మోదీ బహూకరించిన 'తిరుక్కురళ్' తమిళ సాహిత్యంలో అత్యంత ప్రాముఖ్య, గౌరవం పొందిన గ్రంథాల్లో ఒకటి. దీనిని సుప్రసిద్ధ కవి, తత్వవేత్త తిరువళ్లువర్ రచించారు. ఇందులో నీతి, నైతికత, ప్రేమ, సంపద, పాలన, మానవ ప్రవర్తన వంటి అనేక అంశాలపై 1,330 పద్యాలు ఉన్నాయి.ఈ గ్రంథం అర్థవంతమైన, నైతిక జీవితాన్ని ఎలా గడపాలో తెలియజేసే మార్గదర్శిగా ప్రసిద్ధి చెందింది. ఇందులోని అంశాలు సార్వత్రికమైనవి కావడంతో, భాష, సంస్కృతి, దేశాల సరిహద్దులను దాటి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందింది. ఇప్పటికే అనేక ప్రపంచ భాషల్లోకి అనువదించబడిన ఈ గ్రంథం రష్యన్ అనువాదాన్ని పుతిన్‌కు అందించడం ద్వారా, విశ్వమానవ విలువలను చాటిచెప్పే భారతీయ సాహిత్య వారసత్వాన్ని నరేంద్ర మోదీ ఆయనకు పరిచయం చేసినట్టయింది.

# మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

మొదటి పేజీ రువాయి

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉనికిని చాటుకోవడమే లక్ష్యంగా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. స్థానిక పోరులో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని వేగవంతం చేయడం కోసం 8 మంది సీనియర్ నాయకులతో కూడిన 'రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ'ని ఆమె ఏర్పాటు చేశారు. ఈ అత్యున్నత కమిటీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మానిటరింగ్ కమిటీలో మాజీ కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులకు ప్రాధాన్యత కల్పించారు. కమిటీ కన్వీనర్‌గా మాజీ కేంద్ర మంత్రి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సభ్యులుగా సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, రాజ్యసభ మాజీ సభ్యుడు, పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డిని నియమించారు. వీరితో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియా నిర్వహణ, ఎన్నికల సమన్వయ ఇన్ఛార్జి బాధ్యతలను నెల్లూరు డీసీసీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డికి అప్పగించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని మానిటరింగ్ కమిటీకి షర్మిల స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధివిధానాల ఖరారు, గెలుపు గుర్రాలైన అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాల బాధ్యతలను ఈ కమిటీయే చూస్తుందని ఆమె వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మానిటరింగ్ కమిటీతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆదేశించారు.

# అసెంబ్లీలో న్యాయం జరగట్లేదు..

మొదటి పేజీ రువాయి

దాడిచేసి, మాపైనే కేసులు పెట్టారు. ఎమ్మెల్యేలు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులు చేశారు. స్పీకర్‌ను మా ఎమ్మెల్సీ ఏమో అన్నారని ఆరోపించారు. కేసీఆర్ ఇంటిపైకి చావుడప్పు కొట్టమని మనుషుల్ని పంపారు. ఇవన్నీ సీఎం డైరెక్షన్‌లోనే నడిచాయి. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడులకు కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు. మాకు జరిగిన అవమానాన్ని సభలో చెప్పుకునేందుకూ అవకాశమివ్వలేదు. మాకు అసెంబ్లీలో న్యాయం జరగలేదు.. అందుకే ఢిల్లీకి వచ్చాం. ఇది ముఖ్యమంత్రి సిగ్గుపడాల్సిన విషయం' అని సబిత మండిపడ్డారు.వంద రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని సబిత అన్నారు. ఇంతవరకూ హామీలను నెరవేర్చలేదని ఎమ్మెల్యే విమర్శించారు. 22ఏ కింద కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టి కాంగ్రెస్ భూదందాకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై అసెంబ్లీ సాక్షిగా దాడులు చేశారని ధ్వజమెత్తారు. మహిళా కానిస్టేబుళ్లను ముందుపెట్టి శిఖండి రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహూల్ గాంధీ స్పందించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని సోనియా, రాహుల్ దృష్టికి తీసుకెళ్తామని, వారికి లేఖలు కూడా రాస్తున్నామని ఎమ్మెల్యే సబిత తెలిపారు.

# ఫాంహౌస్‌లో కేసీఆర్ కుట్ర..

మొదటి పేజీ రువాయి

తిప్పికొట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.కాంగ్రెస్ పార్టీ ద్వారానే రాజకీయంగా ఎదిగిన సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి లాంటి నాయకులు ఇప్పుడు అదే పార్టీకి నష్టం చేయాలని చూడటం దారుణమని సీఎం అన్నారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోయి ఉంటే వారు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీస్ సిబ్బందిలో కూడా కేటీఆర్‌కు తన రూపమే కనిపిస్తున్నట్టుందని, అందుకే అధికారులపై అంత ఆక్రోశంతో దాడులకు తెగబడుతున్నారని ఎద్దేవా చేశారు.పాలనాపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల మైలురాయిని పూర్తి చేసుకున్న సందర్భంగా, చేపట్టిన సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఎం వివరించారు. చారిత్రక భవనంలో శాసన మండలిని పునఃప్రారంభించుకోవడమే కాకుండా, అసెంబ్లీలోని సెంట్రల్ హాల్‌ను ప్రారంభించి మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని, కేంద్రం చేపట్టబోయే జనాభా లెక్కల్లోనూ ఈ తెలంగాణ నమూనాను అమలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఇదే సమయంలో 'ఎస్ఐఆర్' పేరుతో లక్షలాది ఓట్లను తొలగించే పెద్ద కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా ఉంటే, ఓటర్ల జాబితాలో మాత్రం కేవలం 88 కోట్లే చూపిస్తున్నారని, అంటే దాదాపు 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని వివరించారు. ఎమ్మెల్యేగా మళ్లీ గెలవాలనుకునే ప్రతీ ఒక్కరూ తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కు పరిరక్షణను అత్యంత తీవ్రంగా పరిగణించాలని నిర్దేశించారు. శాసనసభ చర్చల్లో క్రమం తప్పకుండా పాల్గొనాలని, హాజరు శాతాన్ని కాపాడుకుంటూ స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

# ఏఐతో ఉగ్ర ప్రచారం..

మొదటి పేజీ రువాయి

చిన్నారులను లక్ష్యంగా చేసుకుని వారిని తీవ్రవాద భావజాలం వైపు ఆకర్షిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది.ఐక్యరాజ్యసమితికి చెందిన 'కౌంటర్-టెర్రరిజం కమిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరేట్' (సీటీఈడీ) విడుదల చేసిన తాజా నివేదికలో ఈ సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఉగ్రవాద సంస్థలు ఏఐ, ముఖ్యంగా జెనరేటివ్ ఏఐ సహాయంతో వివిధ వర్గాలకు అనుగుణంగా ప్రచార కంటెంట్‌ను వేగంగా రూపొందిస్తున్నాయని తెలిపింది. పురుషులు, మహిళలు, యువతులు, యువకులు, చిన్నారులు.. ఇలా ప్రతి ఒక్కరి మానసిక స్థితికి తగ్గట్టుగా సందేశాలను తయారుచేసి, వాటిని వేగంగా వ్యాప్తి చేస్తున్నాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతిచోటా ఇస్లామిక్ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతోనే ఈ ప్రచారాన్ని ఉద్ధృతం చేశాయని వివరించింది.భారత ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులు కూడా ఈ పరిణామాలను ధ్రువీకరిస్తున్నారు. భారత్‌లో ఐసిస్, అల్-ఖైదా సంస్థలు ఏఐని ఉపయోగించి మహిళలు, చిన్నారులను ప్రత్యేకంగా లక్ష్యం చేసుకున్నాయని ఓ అధికారి తెలిపారు. చిన్న వయసులోనే పిల్లల బలహీనతలను ఆసరాగా చేసుకుని, వారిలో తీవ్రవాద భావజాలాన్ని నింపి భవిష్యత్తుకు సిద్ధం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అమ్మాయిలను, యువతులను ఆకర్షించేందుకు రక్షణ, గుర్తింపు వంటి అంశాలను వాడుకుంటుండగా.. అబ్బాయిలను హింస ద్వారానే శక్తి, గౌరవం లభిస్తాయనే పద్ధతిలో రెచ్చగొడుతున్నారని ఐరాస నివేదిక స్పష్టం చేసింది.ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో ఈ ఏఐ ఆధారిత ప్రచార నమూనాను ఐసిస్ విజయవంతంగా ఉపయోగిస్తోందని, నిఘా వర్గాలు గుర్తించాయి. ఇలా భావజాల వ్యాప్తికి గురైన వారు నేరుగా దాడులకు పాల్పడకుండా నిశ్శబ్దంగా తమ పనిని చేసుకుపోతుండటంతో వీరిని గుర్తించడం కష్టంగా మారుతోందని అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి ఇతర ఉగ్రవాద సంస్థలు కూడా ఇదే పంథాను అనుసరించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# కొండా సురేఖ మాజీ ఓఎస్డీ తండ్రి ఆత్మహత్యాయత్నం

మొదటి పేజీ రువాయి

నిద్రలేవకపోవడంతో కుటుంబ సభ్యులు పరిశీలించగా, సుబ్రమణ్యం అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు గుర్తించారు.వెంటనే వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై అత్యవసర చికిత్స అందిస్తున్నారు. వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. అయితే సుబ్రహ్మణ్యం ఆత్మహత్యాయత్నానికి పాల్పడటానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

**పలు వివాదాల్లో చిక్కుకున్న సుమంత్**

ఇటీవల సుమంత్ పలు వివాదాల్లో చిక్కుకున్నారు. తనపై దాడికి పాల్పడ్డారని హైదరాబాద్‌కు చెందిన గొంగిడి హరికృష్ణ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో సుమంత్‌పై పోలీసులు హత్యాయత్నం కేసు (జీరో ఎఫ్ఐఆర్) నమోదు చేసి, జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

**ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని చెంగిచర్ల ఆర్టీసీ కాలనీకి చెందిన హరికృష్ణ రియల్ ఎస్టేట్ వ్యాపారి. అర్జెంటుగా మాట్లాడాలంటూ హరికృష్ణకు సుమంత్ ఫోన్ చేశారు. ఇప్పుడే ఊరి నుంచి వచ్చా, మరుసటి రోజు కలుస్తానని హరికృష్ణ చెప్పాడు. అయినా సుమంత్? వినలేదు. తర్వాత హరికృష్ణ స్నేహితుడు రాము కూడా ఫోన్ చేసి రమ్మని హరికృష్ణకు చెప్పాడు. దీంతో బాధితుడు తన స్నేహితుడు కిరణ్‌తో కలిసి అదే రోజు రాత్రి 9.45 గంటలకు జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ సమీపంలోని రాము కార్యాలయానికి వెళ్లారు. అక్కడ రాముతో పాటు సుమంత్ కూడా ఉన్నారు. బాధితుడు కనిపించగానే తన పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నావంటూ సుమంత్ ఆగ్రహం వ్యక్తం చేసి దుర్భాషలాడారు. అనంతరం ఇనుప రాడ్డుతో హరికృష్ణపై దాడికి పాల్పడ్డారు.అప్పటికే బాధితుడి ఎడమ చేతికి ఫ్యాక్చర్, తీవ్ర గాయాలయ్యాయి. నోటి నుంచి రక్తంతో కూడిన వాంతులు అయ్యాయి. అక్కడికి వచ్చిన ఇద్దరు కానిస్టేబుళ్లు బాధితుడిని అదే రోజు రాత్రి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అనంతరం కేసు నమోదు చేయడం కోసం చికిత్స తీసుకొని మళ్లీ వస్తానని హరికృష్ణ చెప్పి వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

# సెప్టెంబర్ 17 నుంచి సేవా సంకల్ప్ అభియాన్ ప్రారంభం

మొదటి పేజీ రువాయి

ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని రాంచందర్‌రావు చెప్పారు.ఈ మేరకు సెప్టెంబర్ 17న 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి ఇంటిలో దీపాలు వెలిగించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ప్రయోజనాలను నేరుగా అందిస్తున్నామని ఆయన వివరించారు. యూపీఐ, డిజిటల్ చెల్లింపుల విస్తరణతో భారత్ ప్రపంచ డిజిటల్ పేమెంట్ రంగంలో కీలక స్థానాన్ని సాధించిందన్నారు.పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల ద్వారా చేతివృత్తిదారులు, చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని రాంచందర్‌రావు తెలిపారు. ఈ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు. అభియాన్‌లో భాగంగా మేరే సప్నో కా భారత్, సేవా కీ కహానీ, సేవా జ్యోతి కలశ్ యాత్ర, సుశాసన్ సేవా సంవాద్ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. సేవ, సుశాసనం, ప్రజా సంక్షేమం అనే స్ఫూర్తితో మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే లక్ష్యమని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

**గణేష్ ఉత్సవ కమిటీలు, ప్రజలు.. పోలీస్ శాఖకు సహకరించాలి**

**శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు**

**మట్టి విగ్రహాలను వినియోగించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి**

**డిఎస్పి శ్రీనివాస్ నాయుడు, యాదగిరిగుట్ట రూరల్ సిఐ మదాస్ శంకర్ గౌడ్**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, శుక్రవారం రోజున రాజపేట పోలీస్ స్టేషన్ నందు రాజపేట ఎస్ఐ తఖియుద్దిన్ వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు రాజపేట పోలీస్ స్టేషన్‌లో మండలంలోని వివిధ గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ శాఖ ఉన్నతాధికారులు డిఎస్పి శ్రీనివాస్ నాయుడు, యాదగిరిగుట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ మదాస్ శంకర్ గౌడ్, రాజపేట మండల ఎంపిడిఓ అనిత, డిప్యూటీ తహశీల్దార్ ప్రదీప్ లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొని, వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన, నిమజ్జనం, ఊరేగింపులు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై ఉత్సవ కమిటీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు శాంతియుతంగా, సామరస్యపూర్వక వాతావరణంలో నిర్వహించాలని అధికారులు సూచించారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని సూచించారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాజపేట ఎస్ఐ తఖియుద్దిన్ ఆద్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను డిఎస్పి శ్రీనివాస్ నాయుడు చేత ఉచితంగా పంపిణీ చేసి, పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను వినియోగించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వినాయక చవితి ఉత్సవాలను విజయవంతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఉత్సవ కమిటీలు, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. నిబందనలకి విరుద్దంగా వ్యవహరయించిన వారి పైన తగిన చర్యలు తీసుకోబడుతాయి అని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి రాజపేట మండలం లోని అన్నీ గ్రామాల సర్పంచు లు మరియు అన్నీ పార్టీల ప్రతినిదులు, అఖిలపక్ష నాయకులు హాజరు అయ్యారు.

# తుర్కపల్లి ప్రాంతంలో ఐటీ పార్క్‌ను అభివృద్ధి చేసి పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

**టైర్ల పరిశ్రమల కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి**

**తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర శాసనసభలో తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, పరిశ్రమల కాలుష్య సమస్యలపై ప్రభుత్వ దృష్టికి పలు అంశాలను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలంలో ఐటీ పార్క్ ఏర్పాటు కోసం సుమారు 110 ఎకరాల భూమిని ఇప్పటికే సేకరించడం జరిగిందని తెలిపారు. తుర్కపల్లి మండలం గిరిజన తండాలు, వెనుకబడిన గ్రామాలతో కూడిన ప్రాంతమని, ఇక్కడ ఐటీ పార్క్‌లో ఐటీ సంస్థలు, పరిశ్రమలు, ఇతర ఉపాధి కల్పించే సంస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాన్ని కోరారు. తుర్కపల్లి ప్రాంతంలో ఐటీ పార్క్‌ను అభివృద్ధి చేసి ప్రముఖ సంస్థలను ఆకర్షిస్తే స్థానిక యువతకు తమ ప్రాంతంలోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఉద్యోగాల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి స్థానిక యువతకు తగ్గుతుందని, తద్వారా తుర్కపల్లి ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తుర్కపల్లి ప్రాంతంలో 110 ఎకరాల భూమిని ఐటీ పార్క్ కోసం సేకరించాం. ఇక్కడ పరిశ్రమలు, ఐటీ సంస్థలు ఏర్పాటు చేస్తే స్థానిక నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ఈ ఐటీ పార్క్‌ను త్వరగా అభివృద్ధి చేయాలి" అని బీర్ల ఐలయ్య కోరారు.

**టైర్ల పరిశ్రమల కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి**

ఆలేరు నియోజకవర్గంలోని కాటేపల్లి, బొమ్మలరామరాం మండలం రంగాపూర్ తో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న టైర్ పరిశ్రమల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీర్ల ఐలయ్య శాసనసభ దృష్టికి తీసుకువచ్చారు. టైర్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ, కాలుష్య కారకాల వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పర్యావరణ కాలుష్యంతో పాటు ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కాలుష్యానికి గురయ్యే ప్రాంతాల్లో ప్రజలకు అనారోగ్య సమస్యలు, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల ముప్పు పెరగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసి ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని, సంబంధిత అధికారులు టైర్ పరిశ్రమలను సమగ్రంగా తనిఖీ చేసి, కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తున్నాయా లేదా పరిశీలించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పరిశ్రమలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాలుష్య నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని బీర్ల ఐలయ్య కోరారు. తుర్కపల్లి ఐటీ పార్క్ ద్వారా యువతకు ఉపాధి – కాలుష్య నియంత్రణ ద్వారా ప్రజలకు ఆరోగ్యం అనే లక్ష్యంతో ప్రభుత్వం రెండు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే జీఎంఆర్

**శాంతినగర్‌లో రూ.19 లక్షలతో వర్షపు నీటి కాలువల నిర్మాణానికి శంకుస్థాపన**

**పటాన్‌చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11:** ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో రూ.19 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న వర్షపు నీటి కాలువల నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో కాలనీల్లో నీరు నిలిచిపోకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీ, వర్షపు నీటి కాలువల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. శాంతినగర్ కాలనీ ప్రజల దీర్ఘకాలిక అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.19 లక్షల నిధులతో పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పటాన్‌చెరు, జేపీ కాలనీ డివిజన్లలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను దశలవారీగా మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, కాలనీ అధ్యక్షుడు అంజిరెడ్డి, ఈఈ సురేష్, డీఈ కృష్ణవేణి, ఏఈ లావణ్య, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు



# సెప్టెంబర్ 17 నుంచి సేవా సంకల్ప్ అభియాన్

**నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు**

**ప్రజలకు కేంద్ర పథకాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం: రాంచందర్‌రావు**



**హైదరాబాద్ డెస్క్, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని తెలంగాణలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు. ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17న ప్రత్యేక కార్యక్రమాలతో అభియాన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదే రోజు 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమం నిర్వహించి ప్రతి ఇంటిలో దీపాలు వెలిగించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు రక్తదాన శిబిరాలు, స్వచ్ఛత కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు తదితర సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

**కేంద్ర పథకాలపై అవగాహన**

పేదలు, మహిళలు, చిన్న వ్యాపారులు, చేతివృత్తిదారులు, వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు రాంచందర్‌రావు తెలిపారు. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ, డిజిటల్ చెల్లింపుల వంటి అంశాలను ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. చేతివృత్తిదారులకు ప్రధానమంత్రి విశ్వకర్మ, వీధి వ్యాపారులకు ప్రధానమంత్రి స్వనిధి, చిన్న వ్యాపారులకు ముద్ర రుణాల ద్వారా అందుతున్న ప్రయోజనాలను అర్హులకు వివరించనున్నట్లు తెలిపారు.

**ప్రత్యేక కార్యక్రమాలు**

'మేరే సప్నో కా భారత్', 'సేవా కీ కహానీ', 'సేవా జ్యోతి కలశ్ యాత్ర', 'సుశాసన్ సేవా సంవాద్' వంటి కార్యక్రమాలను నెల రోజుల పాటు నిర్వహించనున్నట్లు రాంచందర్‌రావు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు పార్టీ కార్యకర్తలు ప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడం, సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

**సేవా భావమే ప్రధాన లక్ష్యం**

సేవ, సుపరిపాలన, ప్రజా సంక్షేమం అనే స్ఫూర్తితో కార్యక్రమాలను నిర్వహిస్తామని రాంచందర్‌రావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే అభియాన్ లక్ష్యమని పేర్కొన్నారు.

# డ్రైనేజీ కాలువపై స్లాబ్ నిర్మాణ పనులను ప్రారంభించిన చైర్ పర్సన్ శ్రీవాణి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి పట్టణంలోని స్థానిక 7వ వార్డులో రూ.2.00 లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో డ్రైనేజీ కాలువ పై స్లాబ్ నిర్మాణ పనులకు భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ కొబ్బరికాయలు కొట్టి పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శ్రీమతి కుక్కదువ్వు పద్మ సోమయ్య, అధికారులు డిఈఈ, ఎంఎఈ, వార్డు ప్రజలు, నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించిన కొలనుపాక ఆర్యవైశ్య సంఘం






**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొలాల అమాస్య సందర్భంగా శ్రీ పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆర్యవైశ్య ఆలేరు మండల సంఘం అధ్యక్షులు నాగబండి మధుసూదన్ గుప్తా పుట్టినరోజు సందర్భంగా ఆర్యవైశ్య సంఘ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ప్రొద్దుటూరు రమేష్, ఉపాధ్యక్షులు దిడిగం అంజయ్య, ప్రధాన కార్యదర్శి కాశెట్టి శ్రవణ్ కుమార్, మిరియాల ఉమేష్, దిడిగం సందీప్, దిడిగం సతీష్, గాండ్ల రాజయ్య, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# టీబీ క్యాంపును ప్రారంభించిన సర్పంచ్ నడిమింటి నరేష్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా,రాజపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లోని దూదివేంకటాపూర్ గ్రామంలో టీబీ, బిపి, షుగర్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్యాంపులో ఎక్సరే మరియు తెమడ, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపులో ఎక్సరే 88మంది, షుగర్ పరీక్షలు మరియు బీపీ సుమారు110 మందికి నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపును స్థానిక సర్పంచ్ నడిమింటి నరేష్, ఉపసర్పంచ్ ఇరుగదిండ్ల వెంకటేష్ మరియు వార్డ్ సభ్యులు ప్రారంభించారు ఈ క్యాంపులో జిల్లా టీబి సూపర్ వైసర్ జ్యోతి, టెక్నీషియన్ నటేష్ మరియు ఎయిమ్స్ టెక్నిషన్స్, ఎంపిహెచ్ఈఓ భీకునాయక్, సూపర్ వైసర్ విజయలక్ష్మి, ఎం.ఎల్.హెచ్.పి చైతన్య, హెల్త్ అసిస్టెంట్ ఉపేందర్ మాధవి, కవిత, తదితరులు పాల్గొన్నారు

# అంజయ్య నగర్‌లో దారుణ హత్య.. వంట మనిషిపై కత్తితో దాడి

**పాత కక్షలే కారణమా? హత్య అనంతరం పరారైన నిందితుడు. సీసీటీవీ కెమెరాల్లో ఘటన దృశ్యాలు.. నిందితుడి కోసం పోలీసుల గాలింపు.**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని అంజయ్య నగర్‌లో దారుణ హత్య చోటుచేసుకుంది. ఓ హాస్టల్‌లో వంట మనిషిగా పనిచేస్తున్న శశిధర్ రాజు (40)పై అదే హాస్టల్‌లో పనిచేస్తున్న ప్రమోద్ కత్తితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.పోలీసుల వివరాల ప్రకారం..శశిధర్ రాజు, ప్రమోద్ కొంతకాలంగా అంజయ్య నగర్‌లోని ఓ హాస్టల్‌లో వంట పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమోద్ అకస్మాత్తుగా శశిధర్ రాజుపై కత్తితో దాడి చేసినట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన శశిధర్ రాజు ఘటనాస్థలంలోనే మృతి చెందాడు.మృతుడు, నిందితుడు ఇద్దరూ ఒడిశాకు చెందినవారిగా పోలీసులు గుర్తించారు. ఇద్దరి మధ్య గతంలో ఉన్న విభేదాలు, పాత కక్షలే హత్యకు కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.హత్య అనంతరం నిందితుడు ప్రమోద్ పరారైనట్లు పోలీసులు తెలిపారు. అతడి కోసం ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, హత్యకు సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డైనట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.



# ఎర్రవల్లి ఘటనపై కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆగ్రహం

**దళితులను అవమానిస్తే సహించం.. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ క్షమాపణ చెప్పాలి**

**రాజ్యాంగ విలువలు, దళితుల ఆత్మగౌరవ పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తాం**

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలోని ఎర్రవల్లి, వరదరాజపూర్ గ్రామాల్లో దళితులు చేపట్టిన నిరసన నేపథ్యంలో చోటుచేసుకున్న పరిణామాలపై పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ సెల్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం, వారి పట్ల వివక్ష చూపడం సమాజానికి తప్పుడు సందేశాన్ని ఇస్తుందని విమర్శించారు.ఒక వర్గాన్ని అపవిత్రంగా చిత్రీకరించే విధానం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని నేతలు అన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, గౌరవాన్ని కల్పించిందని గుర్తుచేశారు. కుల ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.పటాన్‌చెరులో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కాటా శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. దళితులను అవమానించే చర్యలను ఎట్టి




పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ దళిత సమాజానికి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.అలాగే శాసనసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై తాత మధుసూదన్ చేసిన వ్యాఖ్యలను నేతలు ఖండించారు. శాసనసభ పవిత్ర వేదిక అని, ఉన్నత పదవుల్లో ఉన్నవారు సంస్కారవంతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.సమావేశంలో పటాన్‌చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, దేవానందం, తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ భరత్, యాదగిరితో పాటు దళిత నాయకులు జైశ్రీ, మహేష్, శంకరయ్య, పీటర్, నాగేష్, చంద్రయ్య, ప్రవీణ్, రవి, సందీప్, హనుమంతు, కిరణ్, శ్రీను, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు, చర్యలు పునరావృతమైతే రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాలు ఐక్యంగా స్పందిస్తాయని నాయకులు హెచ్చరించారు. అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు, అధికారిక వేదికల్లో ఫిర్యాదులు, మానవ హక్కుల సంఘాలను ఆశ్రయించడం వంటి చర్యలు చేపడతామని తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# వినోబా భావే ఆశయాలను కొనసాగించాలి



**భూదానోద్యమ స్ఫూర్తితో పేదలకు న్యాయం చేయాలి**

**గాజుల అనిల్ కుమార్**

**జోగిపేట, హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11:** స్వాతంత్ర్య సమరయోధుడు, భూదానోద్యమ పితామహుడు వినోబా భావే ఆశయాలను కొనసాగించాలని తెలంగాణ సర్వోదయ మండల్ సంగారెడ్డి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ, అందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి గాజుల అనిల్ కుమార్ అన్నారు.వినోబా భావే 131వ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం గాజుల అనిల్ కుమార్ మాట్లాడుతూ.. పేద ప్రజల ప్రయోజనాల కోసం వినోబా భావే దేశవ్యాప్తంగా 14 ఏళ్లపాటు పాదయాత్ర చేసి భూదానోద్యమం ద్వారా భూములను సేకరించారని తెలిపారు. ఆయన సేకరించిన భూములు పేదలకు పూర్తిస్థాయిలో అందకపోవడం, కొన్ని భూములు ఆక్రమణలకు గురికావడం దురదృష్టకరమన్నారు. భూదానోద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ పేదలకు భూములు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భూదాన్ మండల నాయకుడు చిరంజీవి, ధార్మిక సేవా సమితి సభ్యులు కరుణేశ్వర్, పల్లె రమేష్, మణికంఠ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## జీ7 ఆధిపత్యం తగ్గుతోంది.,

# బ్రిక్స్ బలం పెరుగుతోంది

**'జీ7 అని ఎందుకు పిలుస్తారో తెలియదు' అంటూ పుతిన్ వ్యాఖ్యలు.**

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతం: రష్యా అధ్యక్షుడు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ న్యూస్)** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో జీ7 కూటమి ఆధిపత్యం తగ్గుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో భాగంగా నిర్వహించిన బ్రిక్స్ వ్యాపార సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా బ్రిక్స్ కూటమి ఆర్థికంగా మరింత శక్తివంతంగా ఎదుగుతోందని పేర్కొన్నారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో జీ7 దేశాల వాటా సుమారు 18 శాతం ఉండగా.. బ్రిక్స్ సభ్య దేశాల వాటా సుమారు 40 శాతానికి చేరిందని పుతిన్ తెలిపారు. ఈ నేపథ్యంలో "వాటిని జీ7 అని ఎందుకు పిలుస్తారో నాకు తెలియదు" అంటూ వ్యాఖ్యానించారు. మారుతున్న ప్రపంచ క్రమంతో బ్రిక్స్ దేశాల శక్తి, ప్రభావం కూడా పెరుగుతోందని అన్నారు.

**పాశ్చాత్య దేశాలపై విమర్శలు**

పాశ్చాత్య దేశాలు బ్రిక్స్ దేశాలను బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయని పుతిన్ ఆరోపించారు. రష్యాపై అన్యాయమైన ఆంక్షలు విధిస్తూ తమ పూర్వ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు కొన్ని దేశాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. అయినప్పటికీ రష్యా ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగిస్తోందని పేర్కొన్నారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని పుతిన్ ప్రశంసించారు. ప్రపంచం ప్రధాన ఆర్థిక పరివర్తన దశలో ఉందని, బ్రిక్స్ కూటమి వెలుపల ఉన్న దేశాలతోనూ సహకరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.




**బ్రిక్స్ ప్రాధాన్యం పెరుగుతోంది: మోదీ**

బ్రిక్స్ వ్యాపార సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. కూటమి ఏర్పడి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దాని ప్రస్థానాన్ని ప్రస్తావించారు. 2006లో నాలుగు దేశాలతో ప్రారంభమైన బ్రిక్స్ ప్రస్తుతం భాగస్వామ్య దేశాలతో కలిపి 21 దేశాల కుటుంబంగా విస్తరించిందన్నారు.బ్రిక్స్ దేశాలు ప్రపంచ జనాభాలో సుమారు 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్నాయని మోదీ తెలిపారు. ప్రపంచ ఆవిష్కరణలు, సాంకేతిక పరిష్కారాలకు బ్రిక్స్ దేశాలు కీలక కేంద్రాలుగా ఎదుగుతున్నాయని పేర్కొన్నారు.

**మోదీ–పుతిన్ భేటీ**

18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ సుమారు 45 నిమిషాల పాటు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు, ఆర్థిక సహకారం, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం.

# రాజపేట కరువు మండలంగా ప్రకటించాలి...

**ప్రధానమంత్రి ఫసల్ బీమా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలి**

**బిజెపి కిసాన్ మోర్చా యాదాద్రి జిల్లా ఉపాధ్యక్షులు బూరుగు శేఖర్ రెడ్డి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బూరుగు శేఖర్ రెడ్డి శుక్రవారం మీడియాతో మాట్లాడారు... రాజపేట మండలంలో రైతులు పూర్తిగా బోరు బావుల మీద అధారపడి వ్యవసాయం చేస్తారు. ఖచ్చితంగా బోరు బావుల నుండి నీరు బయటికి రావలంటే కరెంట్ ఉండాల్సిందే. అందుకే వ్యవసాయనికి గతంలో ఒక ప్రభుత్వం ఉచిత కరెంట్ ఇస్తే ఇంకో ప్రభుత్వం 24 గంటల కరెంట్ అన్నారు.18గంటలు ఇచ్చారు. ఇప్పుడన్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఉదయం 7గంటల15నిమిషాల నుండి సాయంత్రం 5గంటల 15నిమిషాల వరకు ఇచ్చి 10గంటలు ఇస్తున్నామని చెప్పి అందులో ఎల్సి పేరుతో కటింగ్ చేసి ప్రస్తుతం రోజుకు 6 గంటలు కూడా ఇవ్వడం లేదనీ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి వేసిన పంట పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రాష్ట్ర ప్రభుత్వం బేష జాలాలకు పోకుండా ప్రధానమంత్రి ఫసల్ బీమా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసి ఉంటే "ఎల్ నినో" కారణంగా ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం వచ్చేది అని అన్నారు. రైతులను నిండా ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా రాజపేటను కరువు మండలంగా వెంటనే ప్రకటించి రైతులను ఆదుకోవాలని భారతీయ జనతా పార్టీ తరుపున డిమాండ్ చేశారు

# శేరిలింగంపల్లిలో ఓటర్ల జాబితా సవరణపై సీఈఓ సమీక్ష

**ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి: సి. సుదర్శన్ రెడ్డి**



**శేరిలింగంపల్లి, హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11:** శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా తీవ్ర సవరణ (ఎస్ఐఆర్)–2026 ప్రక్రియను తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా ఎన్నికల నమోదు అధికారి, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, ఐఏఎస్ ఆయన వెంట ఉండి ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను సీఈఓకు వివరించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ పనులను సీఈఓ స్వయంగా పరిశీలించారు.ఓటర్ల జాబితా సవరణ పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రక్రియలో పూర్తి పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని, ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి దశను నిర్వహించాలని సూచించారు.ఎస్ఐఆర్–2026 ప్రక్రియను ఎలాంటి తప్పులకు తావులేకుండా క్రమబద్ధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించిన సీఈఓ, తద్వారా నమ్మకమైన, తాజా ఓటర్ల జాబితాను సిద్ధం చేయవచ్చని పేర్కొన్నారు.

# సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి





**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భారతీయ జనతా పార్టీ రాజపేట మండల శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని తాసిల్దార్ కార్యాలయం నందు డిప్యూటీ తాసిల్దారు ప్రదీప్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోయ మధు, మాజీ ఎంపీటీసీ మాజీ మండల అధ్యక్షులు దాచేపల్లి రాజు మండల ప్రధాన కార్యదర్శి మెండు భగవాన్ రెడ్డి, ఉప సర్పంచ్ మార్క శివ, మల్యాల భరత్, డొంకన సంపత్ గౌడ్, కాకల్లా నవీన్, పోచంగళ్ల బాబు, పారుపల్లి సంజీవ రెడ్డి, గాదె సాయి, బూర్గు భాస్కర్ రెడ్డి, ఎమ్మా కుమార్, బోనగిరి సాయి, తదితరులు పాల్గొన్నారు.



# వేప ఆకుల సారంతో పంటల రక్షణపై రైతులకు అవగాహన

## సహజ సస్యరక్షణ పద్ధతులతో పంటలను కాపాడుకోవాలి

**నెంటూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11:** వేప ఆకుల సారాన్ని ఉపయోగించి పంటలను పురుగుల నుంచి రక్షించుకునే సహజ పద్ధతులపై నెంటూర్ గ్రామ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు జి. తేజశ్రీ, జి. వైష్ణవి, కె. కీర్తన, ఈ. లక్ష్మీ ప్రియ, ఈ. గ్రీష్మ శ్రీ, ఈ. లావణ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు వేప ఆకుల్లో ఉండే సహజ క్రిమి నిరోధక లక్షణాలను రైతులకు వివరించారు. వేప ఆకుల కషాయాన్ని పంటలపై సరైన పద్ధతిలో వినియోగించడం ద్వారా కొన్ని రకాల పురుగు సమస్యలను తగ్గించుకోవచ్చని తెలిపారు. పంటల్లో పురుగుల ఉధృతిని ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరాన్ని బట్టి వేప ఆధారిత సస్యరక్షణ పద్ధతులను పాటించాలని సూచించారు. పర్యావరణానికి అనుకూలమైన సమగ్ర సస్యరక్షణ విధానాలను అవలంబించడం ద్వారా తక్కువ ఖర్చుతో పంటలను ఆరోగ్యంగా కాపాడుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఆత్మ కమిటీ డైరెక్టర్ అజీజ్ ఉర్ రహమాన్, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




# పనీర్ ప్రియులకు షాక్.. తెలంగాణలో పనీర్‌పై నిషేధం.!

## సెప్టెంబర్ 10 నుంచి అమల్లోకి.. ఉత్పత్తి, విక్రయాలపై కఠిన ఆంక్షలు


**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11, తెలంగాణ బ్యూరో :** ప్రజారోగ్య పరిరక్షణ, ఆహార భద్రతకు ప్రాధాన్యమిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాలతో సంబంధం లేకుండా రసాయనాలు, ఇతర పాలేతర పదార్థాలతో తయారు చేసే కృత్రిమ పనీర్ ఉత్పత్తి, నిల్వ, పంపిణీ, విక్రయాలపై ఏడాది పాటు నిషేధం విధించింది. ఈ మేరకు తెలంగాణ ఆహార, అత్యవసర ఔషధ ప్రమాణాల ప్రాధికార సంస్థ కమిషనర్ గెజిట్ నోటిఫికేషన్ నంబర్ 807 ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 నిబంధనల ప్రకారం ఈ నిషేధం అమల్లోకి రానుంది. 2026 సెప్టెంబర్ 10 నుంచి ఏడాది పాటు నిషేధం కొనసాగనుంది. కృత్రిమ పనీర్‌ను ఉత్పత్తి చేయడం, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ, పంపిణీ లేదా విక్రయించడం నిషేధ పరిధిలోకి వస్తుందని అధికారులు స్పష్టం చేశారు. అసలైన పనీర్ పేరుతో కృత్రిమ లేదా కల్తీ పనీర్‌ను విక్రయిస్తూ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే, ప్రామాణిక విధానంలో సహజమైన పాలతో తయారు చేసే అసలైన పనీర్ ఉత్పత్తి, విక్రయాలపై ఈ నిషేధం వర్తించదని అధికారులు స్పష్టం చేశారు.

# శ్రీ వెంకటేశ్వర దేవస్థానంలో అష్టోత్తర శత కలశాభిషేకం

## శ్రావణ మాసం చివరి శుక్రవారం ప్రత్యేక పూజలు

## భక్తిశ్రద్ధలతో పాల్గొన్న మహిళలు, భక్తులు

**న్యూ బోయినపల్లి, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** శ్రావణ మాసం చివరి శుక్రవారం, పొలాల అమావాస్య సందర్భంగా సికింద్రాబాద్ పరిధిలోని న్యూ బోయినపల్లి న్యూ సిటీ కాలనీలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అష్టోత్తర శత కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 108 కలశాలతో స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కలశాభిషేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. పంచామృతాలతో అభిషేకం నిర్వహించడంతో పాటు సప్తహారతులతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం సందర్భంగా ప్రతిరోజూ నిర్వహించిన విష్ణు సహస్రనామ పారాయణంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భజనలు, వెంకటేశ్వర స్వామి కీర్తనలతో భక్తిభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, అర్చకులు మాట్లాడుతూ.. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి సంవత్సరం నిర్వహించే 108 కలశాభిషేక కార్యక్రమాన్ని ఇకపై ప్రతి శ్రావణ మాసం చివరి శుక్రవారం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.





# విఆర్ఏలకు న్యాయం చేయాలి..

## ఇమామ్‌లు, మౌజంల బకాయిలు వెంటనే చెల్లించాలి..

## 97 జీవోను రద్దు చేయాలి

## శాసనమండలిలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్, రాష్ట్రంలోని విఆర్ఏలు, ఇమామ్‌లు - మౌజంలు, పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీశారు. వేలాది కుటుంబాలు, విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విఆర్ఏల సమస్యలపై మాట్లాడుతూ... కుటుంబ సభ్యులు వంతులవారీగా విధులు నిర్వహించిన కారణంగా ఉద్యోగాల కేటాయింపులో కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నప్పటికీ, వాటిని పరిష్కరించకుండా పెండింగ్‌లో ఉంచడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 3,797 కుటుంబాలు ఈ సమస్య పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. ఈ అంశంపై 479 మంది బాధిత విఆర్ఏలు హైకోర్టులో 11 రిట్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ, ఏడాది గడిచినా ప్రభుత్వం ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై ప్రశ్నించారు. బాధిత విఆర్ఏలకు తక్షణమే న్యాయం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. అనంతరం ఇమామ్‌లు, మౌజంల గౌరవ వేతనాల అంశాన్ని ప్రస్తావించిన తీన్మార్ మల్లన్న, ప్రభుత్వం ప్రవేశపెట్టిన లెక్కల్లో అనేక వ్యత్యాసాలు ఉన్నాయని విమర్శించారు. 2024-25లో గౌరవ వేతనాల కోసం రూ.106 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం, 2026-27 నాటికి కేటాయింపులను కేవలం రూ.40 కోట్లకు పరిమితం చేయడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా 15,845 మంది ఇమామ్‌లు, మౌజంలకు గత మూడు నెలలుగా గౌరవ వేతనాలు అందడం లేదని తెలిపారు. ఇప్పటివరకు ఈ పథకం కోసం కేటాయించిన నిధుల్లో భారీ మొత్తాన్ని ఖర్చు చేయకుండా ఉంచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఇమామ్‌లు, మౌజంల గౌరవ వేతనాన్ని రూ.10 వేల వరకు పెంచాలని, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రతి నెల మొదటి తేదీన గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకుల సమస్యలపై మాట్లాడుతూ, జీవో నంబర్ 97 కారణంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి పాలిటెక్నిక్ వ్యవస్థను తీసుకురావడం వల్ల భవిష్యత్తులో స్కాలర్‌షిప్‌లు నిలిచిపోవడం, ఫీజులు పెరగడం, అధ్యాపకులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ఈ అంశంపై వందలాది మంది విద్యార్థులు తనకు వినతిపత్రాలు అందజేశారని వెల్లడించారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పనితీరుపై కూడా తీన్మార్ మల్లన్న తీవ్ర విమర్శలు చేశారు. "స్కిల్ యూనివర్సిటీకి స్కిల్స్ లేని వీసీ ఉన్నారు. దేశంలోనే పీహెచ్‌డీ లేని తొలి వైస్ ఛాన్సలర్ ఆయనే. యూనివర్సిటీలో సరైన మౌలిక వసతులు లేవు. కేవలం ఐదుగురు సిబ్బందితోనే వ్యవస్థ నడుస్తోంది" అని మండలిలో వ్యాఖ్యానించారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులను మనోవేదనకు గురిచేస్తున్న 97 జీవోను వెంటనే రద్దు చేసి, పాత విధానంలోనే పాలిటెక్నిక్ విద్యను కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# జనగణనలో బీసీ కులగణనను తప్పనిసరిగా చేర్చాలి

## కులగణనతోనే బీసీలకు జనాభా దామాషా ప్రకారం న్యాయం

## తెలంగాణ కులగణన దేశానికే రోడ్‌మోడల్: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:** హైదరాబాద్, అసెంబ్లీ జనగణనలో ఎస్సీ, ఎస్టీల వివరాలను సేకరిస్తున్న తరహాలోనే బీసీల సమగ్ర వివరాలను కూడా తప్పనిసరిగా సేకరించాలని ఆలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీల జనాభా ఎంత ఉందో ఖచ్చితమైన లెక్కలు తేలితేనే వారికి విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాల్లో జనాభా దామాషా ప్రకారం న్యాయం చేయడం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర శాసనసభలో 'జనగణనలో కులగణనను పొందుపరచాలి' అనే అంశంపై జరిగిన లఘు చర్చలో బీర్ల ఐలయ్య మాట్లాడారు. తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికే రోడ్‌మోడల్‌గా నిలిచిందని అన్నారు. ఎన్ని కోర్టు కేసులు, ఇబ్బందులు ఎదురైనా సామాజిక న్యాయం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులగణన చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చట్టం**

2025 మార్చిలో శాసనసభలో చట్టం చేసి బీసీలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో 42 శాతం, స్థానిక సంస్థల రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానించి కేంద్రానికి పంపామని ఐలయ్య చెప్పారు. అయితే కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పందించకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కేంద్రం అడ్డంకులు సృష్టించినప్పటికీ స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు బీసీలకు 50 శాతానికిపైగా సీట్లు కేటాయించామని తెలిపారు. దేశంలో రాహుల్‌గాంధీ ఆలోచనలను తొలుత తెలంగాణలో అమలు చేసి రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపామని అన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సుమారు 3,500 కిలోమీటర్లు పాదయాత్ర చేసి దేశంలోని వివిధ వర్గాల ప్రజల స్థితిగతులను తెలుసుకున్నారని చెప్పారు. 'జనాభా దామాషా ప్రకారం అవకాశాల్లో వాటా' కల్పించాలన్న ఆయన ఆలోచనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణలో అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

**1931 తర్వాత తొలిసారి తెలంగాణలో కులగణన**

స్వాతంత్ర్యానికి ముందు 1931లో జరిగిన కులగణన తర్వాత తెలంగాణలో ప్రజా పాలనలోనే తొలిసారిగా సమగ్ర కులగణన చేపట్టామని బీర్ల ఐలయ్య తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెడ్డి సామాజిక వర్గానికి చెందినప్పటికీ బీసీల సంక్షేమం కోసం ఆలోచించి కులగణన నిర్వహించారని అన్నారు. తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికి మార్గదర్శకంగా నిలిచిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2027లో చేపట్టనున్న జనగణనలో బీసీల వివరాలను పొందుపరచకపోతే ఓబీసీలకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బీసీల జనాభాపై సమగ్ర సమాచారం లేకపోతే వారికి అందాల్సిన వాటా, అవకాశాలను నిర్ణయించడం సాధ్యం కాదన్నారు. బీసీ కులగణనను జనగణనలోని 10వ ప్రశ్నావళిలో చేర్చాలని డిమాండ్ చేశారు.

**తెలంగాణలో బీసీల జనాభా 56.36 శాతం**

తెలంగాణలో సుమారు నాలుగు కోట్ల జనాభాలో బీసీలే అత్యధికంగా ఉన్నారని, రాష్ట్రంలో నిర్వహించిన కులగణన ప్రకారం బీసీల జనాభా 56.36 శాతంగా తేలిందని ఐలయ్య తెలిపారు. ఈ నేపథ్యంలో జనాభా దామాషా ప్రకారం విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ముఖ్యమంత్రి, మంత్రులు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఆర్.కృష్ణయ్య తదితరులతో కలిసి జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించినా కేంద్రం పట్టించుకోలేదని విమర్శించారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలోనూ బీజేపీ ఎంపీలు బీసీల సమస్యను ప్రస్తావించలేదని ఆరోపించారు.

**బీసీలను ప్రత్యేక షెడ్యూల్‌లో చేర్చాలి**

బీసీలలో ముఖ్యమైన కురుమ సామాజిక వర్గాన్ని ఉదాహరణగా ప్రస్తావించిన బీర్ల ఐలయ్య.. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఆ వర్గాన్ని వివిధ పేర్లతో పిలుస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కురుమ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో కురుబ, మహారాష్ట్రలో ధంగర్, కేరళలో ముల్ల కురుబ, తమిళనాడులో కురుంబర్ పేర్లతో పిలుస్తారని వివరించారు. ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు ఓబీసీలకు ప్రత్యేక విధానం అవసరమన్నారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే ఓబీసీలకు కూడా ప్రత్యేక రక్షణ, గుర్తింపు కల్పించే విధంగా రాజ్యాంగపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. బీసీ కులగణనకు బీజేపీ ప్రజాప్రతినిధులు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**బీసీల విషయంలో కేంద్రం వైఖరి మార్చుకోవాలి**

కేంద్రంలో బీసీ వర్గానికి చెందిన ప్రధానమంత్రి ఉన్నప్పటికీ బీసీలకు న్యాయం జరగడం లేదని ఐలయ్య విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, రాష్ట్రం చెల్లిస్తున్న పన్నులు, జీఎస్టీ వాటా వంటి అంశాల్లోనూ కేంద్రం నుంచి తగిన సహకారం అందడం లేదన్నారు. బీసీల సమస్యలను ప్రస్తావించే ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బీసీలకు 42 శాతం అవకాశాలు కల్పించడాన్ని జీర్ణించుకోలేక బీజేపీ నాయకులు రాజకీయ డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని జనగణనలో బీసీ కులగణనను చేర్చాలని, ఈ అంశంపై తెలంగాణ శాసనసభ చేసే ఏకగ్రీవ తీర్మానానికి మద్దతు ఇవ్వాలని బీర్ల ఐలయ్య కోరారు.

# ఢిల్లీ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు

## ప్రపంచ శ్రేయస్సుపై అర్థవంతమైన చర్చలు జరగాలి

## పరస్పర సహకారం, శాంతి, అభివృద్ధికి ప్రాధాన్యం: ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** ఢిల్లీలో శనివారం, ఆదివారం జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సదస్సులో అర్థవంతమైన చర్చలు జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశాల మధ్య పరస్పర సహకారం, స్నేహపూర్వక సంబంధాలు, శాంతి, అభివృద్ధిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బ్రిక్స్ సదస్సుకు వివిధ దేశాల అధినేతలు, ప్రతినిధులు హాజరుకానున్నారు. మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ఆర్థికాభివృద్ధి, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారం, ప్రజల సంక్షేమం తదితర అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది.

**పరస్పర సహకారమే కీలకం**

ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా స్పందిస్తూ ప్రపంచ శ్రేయస్సు కోసం దేశాల మధ్య పరస్పర అవగాహన, సహకారం పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ఆకాంక్షించారు. తన సందేశంతో పాటు సంస్కృత శ్లోకాన్ని కూడా మోదీ పంచుకున్నారు. మంచివారితో కలిసి మాట్లాడటం, పనిచేయడం, స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించడం వంటి భావాలను ఆ శ్లోకం ద్వారా ప్రస్తావించారు.

**ఆర్థిక అంశాలపై దృష్టి**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులు, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలు, వాణిజ్య సంబంధాలు, పెట్టుబడులు, సాంకేతిక రంగంలో సహకారం వంటి అంశాలు సదస్సులో ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది. అంతర్జాతీయ సవాళ్లను సమష్టిగా ఎదుర్కొనేందుకు దేశాల మధ్య సమన్వయం అవసరమనే అంశంపైనా చర్చ జరిగే అవకాశం ఉంది. రెండు రోజుల పాటు జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. సదస్సు ద్వారా సభ్య దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావడంతో పాటు, ప్రపంచ శ్రేయస్సుకు దోహదపడే కీలక నిర్ణయాలు వెలువడతాయనే అంచనాలు ఉన్నాయి.

# బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ఉచిత కుట్టు మిషన్ల కోసం సెప్టెంబర్ 15లోగా దరఖాస్తులు**

**అర్హత కలిగిన మహిళలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.**

**కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11:** బీసీ మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ఈ పథకం కింద అర్హత కలిగిన బీసీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న మహిళలు సెప్టెంబర్



15లోగా tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 55 సంవత్సరాల వయస్సు కలిగిన బీసీ మహిళలు అర్హులని, నిరుద్యోగులు, నిరుపేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, అనాథ మహిళలతో పాటు టైలరింగ్ శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యత ఉంటుందని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుతో పాటు ఆధార్, కులం, ఆదాయం, నివాసం, విద్యార్హత, రేషన్ కార్డు, టైలరింగ్ శిక్షణ ధ్రువపత్రాలను సమర్పించాలి. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం కింద అవకాశం ఉంటుందని, 2023--24లో బీసీ స్వయం ఉపాధి పథకం ద్వారా ఆర్థిక లబ్ధి పొందిన వారు అర్హులు కారని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల మహిళలు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ ప్రాంతాల వారు సంబంధిత మున్సిపల్ కమిషనర్‌కు అవసరమైన ధ్రువపత్రాలతో సెప్టెంబర్ 15లోగా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

# పశువుల వైద్యశాల స్థలంపై కబ్జా యత్నం!


**ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ మాజీ కౌన్సిలర్ ఫిర్యాదు**

**స్థలాన్ని పరిరక్షించి, పశువుల వైద్యశాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్**

**దూలపల్లి, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** పశువుల వైద్యశాల నిర్మాణం కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ మాజీ కౌన్సిలర్ చింతల దేవేందర్ యాదవ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గౌడ సంఘానికి చెందిన కొందరు వ్యక్తులు స్థలంలో ఏర్పాటు చేసిన ఖిలాఫత్‌ను తొలగించి, స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. గతంలో మాజీ సర్పంచ్ చింతల లక్ష్మీ దేవేందర్ ఆధ్వర్యంలో పశువుల వైద్యశాల నిర్మాణం కోసం స్థానికంగా స్థలాన్ని కేటాయించినట్లు ఆయన తెలిపారు. ప్రజా ప్రయోజనం కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడం సరికాదని పేర్కొన్నారు. ఈ విషయంపై ఇప్పటికే డీసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు చింతల దేవేందర్ యాదవ్ తెలిపారు. అధికారులు వెంటనే స్థలాన్ని పరిశీలించి, ప్రభుత్వ ప్రయోజనం కోసం కేటాయించిన భూమిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. పశువుల వైద్యశాల నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

**రైతులకు ఎంతో ఉపయోగకరం**

పశు పోషణపై ఆధారపడి జీవించే రైతులకు సమీపంలోనే పశువుల వైద్యశాల అందుబాటులోకి వస్తే ఎంతో ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు పేర్కొన్నారు. పశువులకు అనారోగ్యం వచ్చినప్పుడు దూర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గుతాయని, పాడి రైతులకు వైద్య సేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజా ప్రయోజనం కోసం కేటాయించిన స్థలాన్ని ఎవరైనా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే అధికారులు వెంటనే అడ్డుకోవాలని స్థానికులు కోరారు. పశువుల వైద్యశాల నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చింతల





దేవేందర్ యాదవ్, సంఘం అధ్యక్షులు రమేష్ యాదవ్, కుమార్ యాదవ్, మధు, యాదగిరి, శ్రీకాంత్, చందు తదితరులు పాల్గొన్నారు.

# ఎండిపోతున్న పంటలను చూసి.. రైతుల కన్నీళ్లు

**ఎకరానికి రూ.50 వేల పరిహారం ఇవ్వాలి**

**రాజపేటను వెంటనే కరువు మండలంగా ప్రకటించాలి: బీఆర్ఎస్ నేతలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆరుగాలం కష్టపడి, అప్పులు చేసి సాగు చేసిన వరి పంటలు నీరు లేక ఎండిపోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా,రాజపేట మండలం పాముకుంట గ్రామంలో ఎండిపోయిన వరి పంటలను మదర్ డెయిరీ డైరెక్టర్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సంధిల భాస్కర్ గౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ



డైరెక్టర్ గుర్రం నరసింహులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగునీరు అందక, నిరంతర విద్యుత్ సరఫరా లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. పొట్ట దశలోనే వరి పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆలేరు నియోజకవర్గానికి సాగునీరు అందిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలు కాలేదని ఆరోపించారు. లక్షల రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు పంటలు కళ్లముందే ఎండిపోవడంతో కన్నీరు పెడుతున్నారని అన్నారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన పంటలకు ఎకరానికి రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, రాజపేట మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి రైతులకు సహాయక చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. పాముకుంట రైతులు తమ పంటల పరిస్థితిని నేతలకు వివరించి ఆవేదన వ్యక్తం చేశారు.

# పాకిస్థాన్‌లో అసలు చిచ్చు ఇదేనా

# పంజాబ్ ఆధిపత్యంపై పెరుగుతున్న అసంతృప్తి

పాకిస్థాన్ ప్రస్తుతం తీవ్ర ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటోందని ఓ నివేదిక పేర్కొంది. దేశంలో అత్యధిక జనాభా ఉన్న పంజాబ్ ప్రావిన్స్ అధికారంపై తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తుండటమే ఇందుకు ప్రధాన కారణాల్లో ఒకటని తెలిపింది. సైన్యం, న్యాయవ్యవస్థ, అధికార యంత్రాంగం, భద్రతా సంస్థల్లో పంజాబ్ ప్రాబల్యం ఎక్కువగా ఉందని వివరించింది. పాకిస్థాన్ ఏర్పడినప్పటి నుంచి సెంట్రల్ పంజాబ్ దేశ అధికార వ్యవస్థలో కీలకంగా ఉందని 'ది ఫ్రైడే టైమ్స్'లో మూనిస్ అహ్మర్ రాసిన నివేదిక పేర్కొంది. పంజాబ్‌లోని దక్షిణ సరకీ ప్రాంతానికి మాత్రం సరైన ప్రాధాన్యం దక్కడం లేదని తెలిపింది. ప్రత్యేక ప్రావిన్స్ హోదా కోసం ఆ ప్రాంతం డిమాండ్ చేస్తున్నా లాహోర్ నుంచి అంగీకారం రావడం లేదని పేర్కొంది. పాకిస్థాన్ సైన్యంలో 65 శాతానికి పైగా



అధికారులు, సైనికులు మధ్య, ఉత్తర పంజాబ్ ప్రాంతాలకు చెందినవారేనని నివేదిక తెలిపింది. దీంతో సింధ్, బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా వంటి ప్రావిన్సుల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొంది. కేంద్ర అధికార యంత్రాంగంలోనూ పంజాబ్‌కు భారీ ప్రాతినిధ్యం ఉందని తెలిపింది. నీటి పంపిణీ అంశం కూడా ప్రావిన్సుల మధ్య విభేదాలను మరింత పెంచుతోంది. 1991 నీటి పంపిణీ ఒప్పందం ప్రకారం పంజాబ్‌కు అత్యధిక వాటా ఉన్నప్పటికీ.. ఇతర ప్రాంతాల వాటాలను కూడా ఆక్రమిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. నీటి పంపిణీలో పారదర్శకత లేకపోవడం, నిబంధనల అమలు బలహీనంగా ఉండటం దీనికి కారణాలుగా పేర్కొంటున్నారు. సింధ్, బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రాంతాలు నీటి విషయంలో పంజాబ్ వైఖరిపై తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. సాగు, తాగునీరు, ఆర్థికాభివృద్ధిపై దీని ప్రభావం పడుతోందని ఆయా ప్రాంతాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా సింధ్.. సింధు జలాలపై అధికంగా ఆధారపడుతున్నందున నీటి పంపిణీలో అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తోంది.

# ఢిల్లీ నుంచి అగ్రదేశాలకు పుతిన్ సవాల్..

# 'బ్రిక్స్' బలమెంతో చెప్పిన రష్యా అధ్యక్షుడు!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం వేగంగా పెరుగుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పైగా ఉందని చెప్పారు. జీ7 దేశాల వాటా 29 శాతమేనని తెలిపారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరం'లో పుతిన్ మాట్లాడారు. గత ఐదేళ్ల గణాంకాలను ఆయన ప్రస్తావించారు. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో సగానికి పైగా బ్రిక్స్ దేశాల నుంచే వచ్చిందన్నారు. అదే సమయంలో జీ7 దేశాల వాటా 18 శాతంగా ఉందని చెప్పారు. బ్రిక్స్ ఎదుగుదలను పాశ్చాత్య దేశాలు గమనిస్తున్నాయని పుతిన్ అన్నారు. తమ పోటీ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అవి ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ఈ పోటీ కొన్ని సందర్భాల్లో అసహ్యకర స్థాయికి చేరుతోందని వ్యాఖ్యానించారు. బ్రిక్స్ దేశాల కోసం కొత్త పెట్టుబడి వేదికను ఏర్పాటు చేయాలని పుతిన్ ప్రతిపాదించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా దీనిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు సమీకరించేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. బ్రిక్స్ దేశాలకు భారీ దేశీయ మార్కెట్లు ఉన్నాయని పుతిన్ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం లోతైన మార్పులు జరుగుతున్నాయని చెప్పారు. కొత్త వృద్ధి కేంద్రాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. రష్యాపై 30 వేలకు పైగా ఆంక్షలు ఉన్నాయని పుతిన్ వెల్లడించారు. ప్రపంచం మార్పుల దశలో ఉందని చెప్పారు. ఈ మార్పులు మానవాళి భవిష్యత్తుకు అవసరమని పేర్కొన్నారు.






# కంగ్టి విద్యార్థులకు తప్పని బస్సు ఇబ్బందులు

**సాయంత్రం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని విద్యార్థుల విజ్ఞప్తి.**

**కళాశాలలు ముగిసిన తర్వాత గంటల తరబడి నిరీక్షణ.**

**కంగ్టి, హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11:** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి మండల కేంద్రంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సాయంత్రం వేళ బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తడ్కల్, జంగికే, జంగిబి, ముర్కుంజాల్, రాసోల్, గాంధీనగర్ తదితర గ్రామాల నుంచి ప్రతిరోజూ విద్యార్థులు కంగ్టిలోని పాఠశాలలు, కళాశాలలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం కంగ్టికి చేరుకునేందుకు బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ, సాయంత్రం కళాశాలలు ముగిసిన తర్వాత స్వగ్రామాలకు వెళ్లేందుకు సరైన బస్సు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలలు సాయంత్రం 4 గంటలకు ముగుస్తుండగా, గతంలో 5 గంటల సమయంలో వచ్చే బస్సు ప్రస్తుతం 6 గంటలకు వస్తుండటంతో విద్యార్థులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని తెలిపారు. దీంతో గ్రామాలకు చేరుకునే సమయానికి రాత్రి 7 గంటలు అవుతోందని, ముఖ్యంగా విద్యార్థినులు భద్రతపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల సమయం, భద్రతను దృష్టిలో ఉంచుకుని కళాశాలలు ముగిసిన వెంటనే గ్రామాలకు వెళ్లేలా సాయంత్రం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులను విద్యార్థులు కోరుతున్నారు. విద్యార్థుల ఇబ్బందులను వెంటనే పరిష్కరించి సాయంత్రం వేళ అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.






# కాంగ్రెస్ నాయకుడు బండి శ్రీనివాస్ గౌడ్ 53వ జన్మదిన వేడుకలు ఘనంగా

**యూత్ కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షల వెల్లువ**

**పేట్ బషీర్‌బాగ్, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని 287వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్ 53వ జన్మదిన వేడుకలను పేట్ బషీర్‌బాగ్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులి సందీప్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండి శ్రీనివాస్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించారు. బండి శ్రీనివాస్ గౌడ్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని, భవిష్యత్‌లో ప్రజా సేవతో పాటు పార్టీ సేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని యూత్ కాంగ్రెస్ నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులి సందీప్ గౌడ్‌తో పాటు శ్రీహరి, సూరి, జయంత్ యాదవ్ తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

**కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ముద్దం నర్సింహ యాదవ్**

**నిర్మాణ రంగ కార్మికులకు వాణిజ్య సంఘం కార్డుల పంపిణీ**


**ఓల్డ్ బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికులకు వాణిజ్య సంఘం కార్డుల పంపిణీ కార్యక్రమం ఓల్డ్ బోయిన్‌పల్లిలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ పాల్గొని కార్మికులకు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్మికుల సంఘం కార్యాలయ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయించేలా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం సంఘంతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నర్సింహులు, అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి బాబూరావు, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# గిరిజనుల సాగు భూముల జోలికి ఫారెస్ట్ అధికారులు రావద్దు

## పోడు భూముల్లో జోక్యాన్ని నిలిపివేయాలి

## ఏపీవో డేవిడ్ రాజుకు వినతిపత్రం అందజేసిన న్యూ డెమోక్రసీ నాయకులు



**భద్రాచలం, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** గిరిజన ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూముల జోలికి అటవీశాఖ అధికారులు రావద్దని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ డిమాండ్ చేశారు. చర్ల మండలం చిన్నముసిలేరు గ్రామంలోని ఆదివాసీలు ఎన్నో ఏళ్లుగా పోడు సాగు చేసుకుంటూ పత్తి, వరి పంటలు పండించుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు.గత కొంతకాలంగా అటవీశాఖ అధికారులు సాగు భూముల్లోకి వచ్చి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. 2014 నుంచి గిరిజనులను బెదిరిస్తూ అక్రమ కేసులు పెడతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో ప్రజలతో చర్చించి సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు ఒత్తిళ్లకు గురిచేస్తున్నారని అన్నారు.ఇటీవల సుమారు 45 ఎకరాల పోడు భూముల్లో కందకాలు తవ్వడంతోపాటు మరో 35 ఎకరాల సాగు భూమిని సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. దీంతో ఆదివాసీ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.ఈ సమస్యపై అటవీశాఖ అధికారులతో మాట్లాడి గిరిజనుల సాగు భూములను కాపాడాలని కోరుతూ న్యూ డెమోక్రసీ నాయకులు భద్రాచలం ఏపీవో డేవిడ్ రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# న్యాల్‌కల్‌లో ఘనంగా 'గణేష్ ఆగమన్' గోడపత్రిక ఆవిష్కరణ

## 'మహా అవతార్' ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు

## రేపు ముంగి ఆశ్రమం నుంచి హనుమాన్ దేవాలయం వరకు భారీ శోభాయాత్ర



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** న్యాల్‌కల్ మండల కేంద్రంలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. 'మహా అవతార్' యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలోని శ్రీ మల్లికార్జున హోటల్ ఆవరణలో 'గణేష్ ఆగమన్' గోడపత్రికను ఆవిష్కరించారు.ఉత్సవాల్లో భాగంగా రూ.51 వేల విలువైన గణేష్ మహా విగ్రహాన్ని హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి మండలంలోని శ్రీ ఆదిలక్ష్మి ఆశ్రమంలో ఉంచారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 12న ఉదయం ముంగి ఆశ్రమం నుంచి న్యాల్‌కల్ ఆర్టీసీ బస్టాండ్ వరకు భారీ వాహనంలో విగ్రహాన్ని తీసుకురానున్నారు.అనంతరం ఆర్టీసీ బస్టాండ్ నుంచి శ్రీ హనుమాన్ దేవాలయం వరకు భారీ ఊరేగింపు, శోభాయాత్ర నిర్వహించి గణనాథుడికి ఘన స్వాగతం పలికి దేవాలయంలో ప్రతిష్ఠించనున్నారు.'గణేష్ ఆగమన్' కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో యువభక్తులు కృష్ణ, భవానీ శంకర్‌తో పాటు పలువురు యువకులు పాల్గొన్నారు.




# హస్మత్‌పేట్‌లో పొలాల అమావాస్య అన్నదాన ప్రసాద వితరణ

## ఆర్య వైశ్య సంఘం, శ్రీ వాసవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం

## భక్తిశ్రద్ధలతో పాల్గొన్న నాయకులు, భక్తులు







**హస్మత్‌పేట్, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సికింద్రాబాద్ సర్కిల్-3, ఓల్డ్ బోయిన్‌పల్లి 264వ డివిజన్ హస్మత్‌పేట్ చౌరస్తాలోని శ్రీశ్రీశ్రీ శివదుర్గా ఎల్లమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో పొలాల అమావాస్య సందర్భంగా అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.బోయిన్‌పల్లి ఆర్య వైశ్య సంఘం అమావాస్య అన్నదాన కమిటీ, శ్రీ వాసవి చారిటబుల్ ట్రస్ట్, ఆర్య వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, కాంగ్రెస్ పార్టీ పీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, ప్రాజెక్ట్ చైర్మన్ ఎలకంటి సత్యమూర్తి, వైస్ చైర్మన్ ఎలకంటి పూర్ణచందర్ వాసవి అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథులను శాలువాలతో సత్కరించారు.కార్యక్రమంలో శ్రీ వాసవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పాల అశోక్ గుప్తా, వైస్ చైర్మన్ ఎలకంటి పూర్ణచందర్, కోశాధికారి గందే రామకృష్ణ గుప్తా, కార్యదర్శి నాగిశెట్టి గుప్తా, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు గందే గౌరీశంకర్ గుప్తా, కార్యదర్శి తాటిపల్లి శ్యామ్‌సుందర్ గుప్తా, కోశాధికారి బి. శ్రీనివాస్, సతీష్, శేఖర్, ఎం. హరిబాబు, రమేష్, కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఆర్య వైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు పబ్బ నాగరాణి, కార్యదర్శి కపర్తి లేఖ్య, కోశాధికారి మాఖం వాణి, మాజీ అధ్యక్షురాలు నాగలక్ష్మి, సౌమ్యతో పాటు పలువురు భక్తులు, స్థానికులు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుడు యాదగిరి, కమిటీ సభ్యులు కార్యక్రమ వివరాలను హైదరాబాద్ పల్స్‌కు తెలిపారు. భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

# దళితులు నడిచిన దారిని పసుపు నీళ్లతో కడిగారా?

## బీఆర్‌ఎస్ కార్యకర్తల తీరుపై కాంగ్రెస్, దళిత సంఘాల ఆగ్రహం

## దుందిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు.. కేసు నమోదు



**దూలపల్లి, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** దళిత నేతలు, కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన నిరసన అనంతరం చోటుచేసుకున్న ఘటన దూలపల్లిలో రాజకీయ దుమారం రేపింది. నిరసన జరిగిన ప్రాంతానికి బీఆర్ఎస్ కార్యకర్తలు, కొందరు మహిళా నేతలు చేరుకుని కాంగ్రెస్ నాయకులు నడిచిన ప్రాంతాన్ని పసుపు నీళ్లు, పాలతో శుద్ధి చేశారని కాంగ్రెస్, దళిత సంఘాల నాయకులు ఆరోపించారు.నిరసనకారులు నడిచిన దారిని ప్రత్యేకంగా పసుపు నీళ్లతో శుభ్రం చేయడం దళిత సమాజాన్ని అవమానించడమేనని కాంగ్రెస్, దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు సమాజంలో అస్పృశ్యత, అంటరానితనం వంటి వివక్షాపూరిత భావాలను ప్రోత్సహించేలా ఉన్నాయని వారు ఖండించారు.

**'దళితులను అవమానించే చర్యలు సహించం'**

ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే హక్కు ఉందని నాయకులు పేర్కొన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఒక వర్గం నడిచిన దారిని మరో వర్గం అపవిత్రంగా చిత్రీకరించడం అవమానకరమని అన్నారు. ఇలాంటి ఘటనలు సమాజంలో విభజనకు దారితీస్తాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఘటనపై కాంగ్రెస్, దళిత సంఘాల నాయకులు దుందిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కావలి చంద్రయ్య, కుత్బుల్లాపూర్ ఎస్సీ సెల్ చైర్మన్ విజయ్ కుమార్, దూలపల్లి డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గడ్డం ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.దళితులను అవమానించేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనతో దూలపల్లి ప్రాంతంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

# డీజే వద్దు..బాజా ముద్దు!

## గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజే సౌండ్‌కు అనుమతి లేదు

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి





**రామగుండం, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు గోదావరిఖని పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గోదావరిఖని పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీజే నిర్వాహకులు, యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. మండపాల నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఉత్సవాల్లో సాధారణ ధ్వని వ్యవస్థను మాత్రమే వినియోగించాలని, మైక్‌లను రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలని సూచించారు.పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించి డీజే వినియోగిస్తే సంబంధిత నిర్వాహకులు, యజమానులు, మండపాల నిర్వహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనకు అవకాశం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీజే నిర్వాహకులు, యజమానులను బైండోవర్ చేసినట్లు తెలిపారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంతోషంగా నిర్వహించాలని, అదే సమయంలో పోలీసు శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఇన్స్పెక్టర్ కోరారు. "డీజేకు దూరంగా ఉండి బాజాతో భక్తి భావాన్ని చాటుకుందాం. ప్రశాంత వాతావరణంలో గణనాథుని ఉత్సవాలను నిర్వహిద్దాం" అని పిలుపునిచ్చారు.

# అధికారం పోయినా బీఆర్ఎస్ అహంకారం వీడలేదు

## సభను అడ్డుకోవడమే లక్ష్యంగా ఫామ్‌హౌస్‌లో వ్యూహాలు..

## కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11, తెలంగాణ బ్యూరో:** శాసనసభ సమావేశాలను సజావుగా సాగనివ్వకుండా బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. అధికారం కోల్పోయినా ఆ పార్టీ నేతలు అహంకారాన్ని వీడలేదని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ఫామ్‌హౌస్‌లో సభను అడ్డుకునేందుకు వ్యూహాలు రూపొందించారని ఆరోపించారు.శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధుల పట్ల కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనుచితంగా వ్యవహరించారని, సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగించడం వల్ల మూడు రోజులపాటు శాసనసభ సజావుగా సాగలేదని పేర్కొన్నారు. సభాపతిని కూడా అభ్యంతరకర పదజాలంతో దూషించారని ఆరోపించారు.ప్రతిపక్షం పేరుతో సభా కార్యకలాపాలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య పద్ధతి కాదని సీఎం అన్నారు. ప్రజా సమస్యలను చర్చించేందుకు, ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ప్రజలు ఎమ్మెల్యేలను ఎన్నుకుంటారని, సభను అడ్డుకోవడం వల్ల చివరకు నష్టపోయేది ప్రజలేనని పేర్కొన్నారు.

**దళితుల అంశంపై ఆగ్రహం**

నిరసన కార్యక్రమంలో భాగంగా దళితులు నడిచిన ప్రదేశాన్ని శుద్ధి చేయడం ద్వారా వారిని అవమానించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇలాంటి చర్యలు సామాజికంగా తీవ్ర అభ్యంతరకరమని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వాస్తవాలతో సమాధానం చెప్పాలని సూచించారు. శాసనసభ ప్రారంభమైనప్పటి నుంచి చోటుచేసుకున్న పలు ఘటనలపై విచారణ జరుగుతోందని తెలిపారు. సభలో ప్రభుత్వ వాదనను సమర్థంగా వినిపించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అభినందించారు.

**ఎమ్మెల్యేలకు కీలక సూచనలు**

ప్రతి ఎమ్మెల్యే శాసనసభ సమావేశాలకు తప్పనిసరిగా హాజరై చర్చల్లో పాల్గొనాలని రేవంత్ రెడ్డి సూచించారు. నియోజకవర్గ సమస్యలను సభలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ప్రజలు తమ ప్రతినిధుల పనితీరును నిశితంగా గమనిస్తారని, సభలో చురుకైన పాత్ర రాజకీయ భవిష్యత్తుకు కీలకమని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

**సునీత, సబితపై విమర్శలు**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిపై కూడా రేవంత్ రెడ్డి విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అవకాశాలు ఇవ్వకపోతే వారు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా అని ప్రశ్నించారు. పోలీసు సిబ్బంది వ్యవహారంలో బీఆర్ఎస్ నేతల తీరుపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.తెలంగాణలో చేపట్టిన కులగణన విధానం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్న సీఎం, దీనిని దేశవ్యాప్తంగా అమలు చేయాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు.

**ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలి**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పేరుతో ఓట్ల తొలగింపు జరుగుతోందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఈ అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఓటు హక్కు పరిరక్షణపై ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను పరిష్కరించడం, శాసనసభలో చురుకుగా పాల్గొనడం ఎమ్మెల్యేల రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



# త్వరలో ప్రపంచ వాణిజ్యానికి భారత్ కేరాఫ్: ప్రధాని మోదీ

**బ్రిక్స్ దేశాల ఆర్థిక ప్రాధాన్యం పెరుగుతోంది**
**యువత, కొత్త వ్యాపారాలు, సాంకేతికతతో భారత్ వేగంగా ముందుకు: మోదీ**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్):** ప్రపంచ వాణిజ్యంలో భారత్ మరింత కీలక పాత్ర పోషించే దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భవిష్యత్తులో ప్రపంచ వాణిజ్యానికి భారత్ ప్రధాన కేంద్రంగా మారే రోజులు సమీపిస్తున్నాయని పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల ఆర్థిక ప్రగతి, ప్రపంచ వాణిజ్యంలో వాటి పెరుగుతున్న వాటాను ప్రస్తావిస్తూ భారత్ ఆర్థిక సామర్థ్యాన్ని వివరించారు.గత 21 ఏళ్లలో బ్రిక్స్ కూటమి విస్తృతంగా అభివృద్ధి చెందిందని మోదీ తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ వాణిజ్యంలో బ్రిక్స్ దేశాల వాటా 20 శాతాన్ని దాటిందని పేర్కొన్నారు. సభ్య దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారం, ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



**కొత్త వ్యాపారాలతో ఆర్థిక పురోగతి**

భారత్‌లో కొత్త వ్యాపార సంస్థలు, సాంకేతిక సంస్థలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని మోదీ తెలిపారు. దేశంలో 120కి పైగా యూనికార్న్ సంస్థలు, రెండు లక్షలకు పైగా కొత్త వ్యాపార సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. యువతలో వ్యాపార ఆలోచనలు పెరగడం, సాంకేతికత వినియోగం, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడటం దేశ ఆర్థిక పురోగతికి దోహదపడుతున్నాయని చెప్పారు.తయారీ, సేవలు, సాంకేతికత, డిజిటల్ రంగాల్లో భారత సంస్థలు అంతర్జాతీయ స్థాయిలో తమ సామర్థ్యాన్ని చాటుతున్నాయని మోదీ అన్నారు. విస్తరిస్తున్న వినియోగదారుల మార్కెట్, యువతలో నైపుణ్యాలు, పెరుగుతున్న వ్యాపార అవకాశాలు భారత్‌ను ప్రపంచ వాణిజ్యంలో మరింత కీలక భాగస్వామిగా నిలబెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**బ్రిక్స్‌తో వాణిజ్య సంబంధాల బలోపేతం**

బ్రిక్స్ వేదిక ద్వారా సభ్య దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని మరింత పెంచుకోవడంతో పాటు కొత్త మార్కెట్లను అందిపుచ్చుకోవాలని భారత్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు మోదీ వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది. దేశీయ సంస్థలు అంతర్జాతీయ మార్కెట్లలో విస్తరించడంతో పాటు భారత్ విదేశీ పెట్టుబడులకు కీలక కేంద్రంగా ఎదిగే అవకాశాలు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

# మోదీ–పుతిన్ భేటీలో కీలక ఒప్పందాలపై చర్చ

**2030 నాటికి భారత్-రష్యా ద్వైపాక్షిక వాణిజ్యం 100 బిలియన్ డాలర్ల లక్ష్యం.**
**ఇంధన భద్రత, రక్షణ, అణుశక్తి, సాంకేతిక రంగాలపై కీలక చర్చలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన ద్వైపాక్షిక భేటీకి అంతర్జాతీయ ప్రాధాన్యం లభించింది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ఇంధన భద్రత, మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం.పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో భారత్‌కు నిరంతర ఇంధన సరఫరా, ఇంధన భద్రతకు సంబంధించిన అంశాలు భేటీలో ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. 2030 నాటికి భారత్–రష్యా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యంపైనా చర్చ జరిగినట్లు సమాచారం.

**పలు రంగాల్లో భాగస్వామ్యం**

రక్షణ, సాంకేతికత, పౌర అణుశక్తి, ఔషధాలు, ఎరువుల సరఫరా రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరుదేశాలు భావిస్తున్నట్లు కథనం పేర్కొంది. రష్యా తయారీ రంగానికి అవసరమైన నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికులను పంపించే ప్రతిపాదనపైనా సానుకూల చర్చ జరిగినట్లు తెలిపింది.

**ఉక్రెయిన్‌పై మోదీ స్పష్టమైన వైఖరి**

ఉక్రెయిన్ యుద్ధం ఐదో సంవత్సరంలోకి ప్రవేశించిన నేపథ్యంలో వివాదానికి త్వరితగతిన శాంతియుత పరిష్కారం కనుగొనాలని మోదీ కోరినట్లు సమాచారం. అంతులేని యుద్ధం కంటే శాంతికి మార్గం చూపాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేసినట్లు కథనం పేర్కొంది. భారత్ ఎల్లప్పుడూ శాంతి వైపే నిలుస్తుందని




మోదీ పునరుద్ఘాటించినట్లు తెలిపింది.


**మోదీ–పుతిన్ భేటీకి ప్రత్యేక ప్రాధాన్యం**

గత 11 ఏళ్లలో మోదీ–పుతిన్ భేటీ కావడం ఇది 19వసారి అని కథనం పేర్కొంది. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఈ సమావేశం జరగడం, భారత్––రష్యా వ్యూహాత్మక సంబంధాల్లో కీలక పరిణామంగా అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి.

# ఎల్ నినో మరింత తీవ్రం.. సముద్ర జీవవ్యవస్థపై తీవ్ర ప్రభావం

**ఇస్రో ఉపగ్రహాల డేటాలో కీలక మార్పులు.**
**సముద్ర ఉపరితల గాలులు బలహీనపడటంతో క్లోరోఫిల్ స్థాయిలో భారీ తగ్గుదల**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** పసిఫిక్ మహాసముద్రంలో ఎల్ నినో ప్రభావం అంచనాలకు మించిన స్థాయిలో కొనసాగుతున్నట్లు ఇస్రో ఉపగ్రహాల తాజా పరిశీలనలో వెల్లడైంది. సముద్ర ఉపరితల గాలులు, సముద్ర జీవవ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులు భవిష్యత్తులో ప్రపంచ వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.ఇస్రోకు చెందిన జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం శాస్త్రవేత్తలు ఓషన్‌శాట్–3, భూ పరిశీలన ఉపగ్రహాల నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించారు. 2023 నుంచి 2026 వరకు ఏప్రిల్, మే, జూన్ నెలల్లో సముద్ర ఉపరితల గాలులు, క్లోరోఫిల్–ఎ స్థాయిల్లో వచ్చిన మార్పులను పరిశీలించారు.సాధారణంగా పసిఫిక్ ప్రాంతంలో తూర్పు నుంచి వీచే గాలులు బలహీనపడి పడమర దిశగా మారడంతో సముద్ర గర్భంలోని చల్లటి నీరు పైకి వచ్చే ప్రక్రియ మందగించినట్లు గుర్తించారు. దీంతో సముద్రంలో సూక్ష్మజీవులైన ఫైటోప్లాంక్టన్ వృద్ధి తగ్గి, క్లోరోఫిల్ స్థాయిలు గణనీయంగా పడిపోయినట్లు తేలింది.ప్రత్యేకంగా పశ్చిమ, మధ్య పసిఫిక్‌లోని భూమధ్యరేఖ ప్రాంతాల్లో ఈ మార్పులు స్పష్టంగా కనిపించినట్లు ఇస్రో తెలిపింది. సముద్ర ఉపరితల గాలులు, సముద్ర జీవ ఉత్పాదకత మధ్య ఉన్న బలమైన సంబంధాన్ని ఈ పరిశీలన వెల్లడించినట్లు పేర్కొంది.ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు మధ్య ఎల్ నినో పరిస్థితులు బలపడే అవకాశాలు అధికంగా ఉన్నాయని ప్రపంచ వాతావరణ సంస్థ గతంలో హెచ్చరించింది. జూలై చివరి నాటికి ఈ ప్రక్రియ మరింత వేగవంతమైనట్లు ఉపగ్రహ డేటా సూచించింది.ఎల్ నినో ప్రభావం మరింత తీవ్రతరం అయితే క్లోరోఫిల్ తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సముద్ర జీవవ్యవస్థకు ముప్పు పెరిగే అవకాశం ఉంది. సముద్ర గర్భ ఉష్ణోగ్రతలు, సముద్ర మట్టాలు, థర్మోక్లైన్ లోతు, సముద్ర ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని ఇస్రో పేర్కొంది.



# బ్రిక్స్‌పై కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు

**గ్లోబల్ సౌత్‌కు బ్రిక్స్ కీలక వేదిక: శశిథరూర్.**
**పాశ్చాత్య దేశాలకు వ్యతిరేక కూటమిగా మారకూడదు.. జాతీయ ప్రయోజనాలే కీలకం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు విషయంలో కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బ్రిక్స్ వల్ల భారత్‌కు ఒరిగిందేంటని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం ప్రశ్నించగా.. మరో సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ మాత్రం ఈ కూటమి ప్రాధాన్యతను సమర్థించారు. బ్రిక్స్ భారత్ దౌత్యపరమైన సామర్థ్యాన్ని చాటే కీలక వేదికగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

**గ్లోబల్ సౌత్‌కు కీలక వేదిక**

గ్లోబల్ సౌత్ దేశాల ఆందోళనలను ప్రపంచ వేదికపై ప్రస్తావించేందుకు బ్రిక్స్ ముఖ్యమైన వేదికగా ఉపయోగపడుతుందని శశిథరూర్ అన్నారు. ఈ కూటమిలోని దేశాలు ప్రపంచ జనాభాలో గణనీయమైన వాటాను, ప్రపంచ స్థూల దేశీయోత్పత్తిలో సుమారు 41 శాతం వాటాను కలిగి ఉన్నాయని తెలిపారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ తన దౌత్యపరమైన ప్రభావాన్ని చాటుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు.

**పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకంగా ఉండకూడదు**

బ్రిక్స్ అమెరికా లేదా ఇతర పాశ్చాత్య దేశాలకు వ్యతిరేక కూటమిగా మారకూడదని థరూర్ స్పష్టం చేశారు. పాశ్చాత్యేతర దేశాల వేదికగా మాత్రమే కాకుండా, భారత్ తన జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఈ కూటమిని ఉపయోగించుకోవాలని సూచించారు. గ్లోబల్ సౌత్ దేశాల సమస్యలను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత భారత్‌పై ఉందన్నారు.

**ఎగుమతులు తగ్గి.. దిగుమతులు పెరుగుతున్నాయి**

బ్రిక్స్ దేశాలతో భారత్ వాణిజ్యం పెరుగుతున్నప్పటికీ, వాణిజ్య సమతుల్యత విషయంలో ఆందోళన ఉందని థరూర్ పేర్కొన్నారు. ఆయా దేశాలకు భారత్ నుంచి జరిగే ఎగుమతులు తగ్గుతుండగా, దిగుమతులు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ అంశంపై కూడా భారత్ తన జాతీయ ప్రయోజనాలను




కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**చిదంబరం భిన్న వైఖరి**

ఇటీవల పి.చిదంబరం బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుల వల్ల భారత్‌కు స్పష్టంగా ఏం ప్రయోజనం కలిగిందని ప్రశ్నించారు. గత కొన్ని సమావేశాల నుంచి చెప్పుకోదగ్గ ఫలితాలు రాలేదని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే గతంలో బ్రిక్స్ ద్వారా కొన్ని ప్రయోజనాలు చేకూరాయని కూడా పేర్కొన్నారు. చిదంబరం వ్యాఖ్యలకు భిన్నంగా శశిథరూర్ బ్రిక్స్ ప్రాధాన్యతను సమర్థించడం కాంగ్రెస్‌లోని భిన్నాభిప్రాయాలను స్పష్టం చేస్తోంది.



# రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన దూది వెంకటాపురం విద్యార్థులు

**అండర్--14 విభాగంలో వివేక్, రాహుల్ ఎంపిక**
**జిల్లాస్థాయి ఎంపికల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం దూది వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఏదుల వివేక్, ఎర్రోళ్ల రాహుల్ అండర్--14 విభాగంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు.సెప్టెంబర్ 9న నల్లగొండ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ఎంపికల్లో సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. దూది వెంకటాపురం పాఠశాల తరఫున పాల్గొన్న వివేక్, రాహుల్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల వ్యాయామ విద్యా సంచాలకుడు పాతకోటి మధు తెలిపారు.మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుంచు విజయలక్ష్మి ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని కోరారు.విద్యార్థులను ఉపాధ్యాయులు నర్సింహాచారి, వెంకటేశ్వర్లు, రవీందర్, శ్రీనివాస్,



# కంటోన్మెంట్‌లో కమ్యూనిటీ హాళ్లకు రూ.8.50 కోట్ల నిధులు

**28 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, మరమ్మతులకు నిధుల మంజూరు.**
**మంత్రి శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక కృతజ్ఞతలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, అసంపూర్తి పనుల పూర్తి, మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 8.50 కోట్ల నిధులను మంజూరు చేసింది. నియోజకవర్గంలోని 28 కమ్యూనిటీ హాళ్లకు ఈ నిధులను వినియోగించనున్నారు.గత అసెంబ్లీ సమావేశాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, అసంపూర్తి పనుల పూర్తి, మరమ్మతులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ సభ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.మంత్రి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రూ. 8.50 కోట్ల నిధులు మంజూరు చేయడంతో ఎమ్మెల్యే శ్రీగణేష్ అసెంబ్లీలోని మంత్రి శ్రీధర్‌బాబు కార్యాలయంలో ఆయనను కలిసి కంటోన్మెంట్ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి 'నవ కంటోన్మెంట్'గా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

# కొండా సురేఖకు బుజ్జగింపులు... కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్



తెలంగాణ మాజీ మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో, సురేఖతో ఆమె నేరుగా సంభాషించినట్లు తెలియడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.రాష్ట్ర రాజకీయాలు, పార్టీలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. వ్యక్తిగత అంశాలు, అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో తిరిగి చురుగ్గా పాల్గొనాలని ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్.. కొండా సురేఖకు సూచించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి తప్పించిన తర్వాత జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు సురేఖ గైర్హాజరు కావడం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో, పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకే ఇన్‌ఛార్జ్ నేరుగా సురేఖతో మాట్లాడినట్లు సమాచారం. ఈ ఫోన్ కాల్ అనంతరం సురేఖ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా లేదా అన్నది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది.